క్లుప్తంగా

వైభవంగా పల్లకీ సేవ



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న అర్చకులు

ఉరవకొండ రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీ నృసింహస్వామి పల్లకీ సేవను శనివారం వైభవంగా నిర్వహించారు. తొలుత అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత నృసింహ స్వామి ఉత్సవమూర్తులను పుష్పాలు, పట్టువస్త్రాలతో అలంకరించిన పల్లకీలో కొలువుదీర్చి ఆలయం చుట్టూ ఊరేగించారు.

బాల్య వివాహాలు అరికడదాం

బ్రహ్మసముద్రం: బాల్య వివాహాలను అరికడదామని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ నాగమణి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జనని మండల సమైఖ్య కార్యాలయంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. అనంతరం పీడీ మాట్లాడుతూ చిన్న వయసులో వివాహాలు చేయడం చట్టరీత్యానేరమన్నారు. చిన్న వయసులో వివాహాలు చేయడం ద్వారా అనేక సమస్యలు ఎదురవుతాయన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ సుమతి, ఎంఈఓ ఓబుళపతి, సూపర్‌వైజర్లు ఖాసీంబీ, రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలు



నగదు పురస్కారాలు అందుకున్న దృశ్యం

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ బాలికల, బాలుర కళాశాలలో ఎంబీసీ, బైపీసీ కోర్సుల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు 1987–89 బ్యాచ్ విద్యార్థులు నగదు పురస్కారాలు అందించారు. శనివారం కళాశాల ఆవరణలో ఎంఈఓ ఈశ్వరప్ప, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రమేష్ ఆధ్వర్యంలో ఈఏడాది ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించి టాపర్లుగా నిలిచిన విద్యార్థులు హర్షవర్ధన్ (950), అంజి (940), లలిత (960), మహిమ జ్యోతి (926)కు నగదు పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శశికళ, సాకే భాస్కర్, మాధవిలత, తాటికొండ వెంకట్, వెంకటేష్ బాబు, విజయ్‌కుమార్, రామాంజినేయులు, కృష్ణమూర్తి, భీమలింగ, విశ్వేశ్వరబాబు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి కె.భాను

కళ్యాణదుర్గం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి కె.భాను సూచించారు. శనివారం స్థానిక ఉషోదయ మహిళా సమాఖ్య కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మహిళలకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారు మండల న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించాలని తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు పార్థసారథి చౌదరి, న్యాయవాదులు దాదా ఖలందర్, ఉషోదయ మహిళా సమాఖ్య అధ్యక్షులు అనిత, రామలక్ష్మి, కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకుల అరెస్ట్

ఉరవకొండ: పట్టణంలోని గవిమఠం సమీపంలో మట్కా ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు అర్బన్ సీఐ మహానంది శనివారం తెలిపారు. వీరి వద్ద నుంచి మట్కా చీటీలతో పాటు రూ.32,500 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా

కూడేరు: ఆర్‌డీఎస్‌ఎస్ పథకం ద్వారా వ్యవసాయ మోటార్లు, గృహాలకు విద్యుత్ సరఫరాకు ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేసి, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్ తెలిపారు. ఆర్‌డీఎస్‌ఎస్ పథకం ద్వారా మండలంలో ఏర్పాటు చేస్తున్న 33 కేవీ, 11 కేవీ లైన్లను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన కూడేరు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక లైన్ల ఏర్పాటుతో అధికలోడు సమస్య తీరుతుందన్నారు. గృహాలకు 24 గంటలు, వ్యవసాయ మోటార్లకు 9 గంటల సేపు విద్యుత్ సరఫరా చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఏడీలు పద్మజ, రవిశంకర్ ఏఈ మగ్బుల్ బాషా పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో పట్టుబడిన అల్యూమినియం, కాపర్

ఉరవకొండ: ఆర్టీసీ బస్సులో గుట్టుచప్పుడు కాకుండా రవాణా చేస్తున్న అల్యూమినియం (సిల్వర్), కాపర్ ముడిసరుకును ఉరవకొండ డిపో వద్ద వాణిజ్య పన్నుల శాఖ అధికారులు శనివారం పట్టుకున్నారు. కళ్యాణదుర్గం డిపో ఆర్టీసీ సర్వీసులో కళ్యాణదుర్గం నుంచి హైదరాబాద్‌కు అల్యూమినియం, కాపర్ టన్ను బరువు ఉన్న ముద్దలను 20 సంచుల్లో నింపి తరలిస్తుండగా, పక్కా సమాచారంతో వాణిజ్య పన్నుల శాఖ డీసీటీఓ సురేష్ సిబ్బందితో కలిసి ఉరవకొండ డిపోలో పట్టుకున్నారు.

సంక్షేమం మృగ్యం

- ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల్లో సౌకర్యాలు నిల్
- ముద్దన్నం, నీళ్ల సాంబారు
- నేలపైనే నిద్ర.. ఆరు బయటే స్నానాలు
- దోమకాటుకు గురై అనారోగ్యం పాలవుతున్న విద్యార్థులు



రాయదుర్గం బీసీ వసతి గృహంలో చాలీచాలని దుప్పట్లతో నిద్రపోతున్న విద్యార్థులు



ఉరవకొండ బీసీ హాస్టల్‌లో దుప్పట్లు లేక ఇలా..

కళ్యాణదుర్గం/ఉరవకొండ/రాయదుర్గం : వైఎస్సార్‌సీపీ హయాంలో విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేశారు. సంక్షేమ వసతి గృహాల్లో పేద విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా ఎప్పటికప్పుడు సౌకర్యాలు కల్పించారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సంక్షేమ వసతి గృహాల్లో సౌకర్యాలు మృగ్యమయ్యాయి. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని సంక్షేమ హాస్టళ్లలో సౌకర్యాలు కల్పించక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ వసతి గృహాల్లో సౌకర్యాల కల్పనపై సౌకర్యాలపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. అరకొర సౌకర్యాల నడుమే పేద విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో బాలురు, బాలికల ఎస్సీ వసతి గృహాలు 8 ఉండగా, అందులో 1,181 మంది విద్యార్థులున్నారు. ఎస్టీ వసతి గృహం ఒకటి ఉండగా 180 మంది విద్యార్థులు, బీసీ వసతి గృహాలు 7 ఉండగా, అందులో 1,200 మంది విద్యార్థులు ఉన్నారు.

ముద్ద అన్నం, నీళ్ల సాంబారు...:

నియోజకవర్గంలోని అన్ని వసతి గృహాల్లో మెనూ ప్రకారం భోజనం వడ్డించడం లేదనే విమర్శలు ఉన్నాయి. మెస్ ఛార్జీలు పెండింగ్‌లో ఉన్నాయన్న కారణంతో వసతి గృహాల ఇన్‌చార్జులు ముద్ద అన్నం, నీళ్ల సాంబారుతోనే సరిపెడుతున్నారు. చాలీచాలనీ మెస్ బిల్లులతో వార్డెన్లు భోజనాలు పెట్టేందుకు కూడా వెనుకడుగు వేస్తున్నారు. ఈ క్రమంలో నాణ్యమైన భోజనం లభించక విద్యార్థులు చదువుపై దృష్టి సారించలేక సతమతమవుతున్నారు.

కటిక నేలపైనే నిద్ర, ఆరుబయటే స్నానాలు:

అన్ని వసతి గృహాల్లో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించలేదు. కటిక నేలపైనే భోజనంతో పాటు నిద్రపోవాల్సిన పరిస్థితి. రాత్రిళ్లు చలికి, దోమలకాటుకు దిన దిన గండంగా గడుపుతున్నారు. ఇదంతా ఆయా హాస్టళ్ల వార్డెన్లకు తెలిసినా ఏమి చేయలేని పరిస్థితి. దీంతో రాత్రిళ్లు కొందరు విద్యార్థులు దోమకాట్లకు గురై ఆసుపత్రి పాలైన ఘటనలు కూడా లేకపోలేదు. దీనికి తోడు బాలుర వసతి గృహాలలో మరుగుదొడ్లు, బాత్ రూంలు అధ్వానంగా ఉన్నాయి. బాత్‌రూంలలో స్నానాలు చేయలేక ఆరుబయటే ముగించేస్తున్నారు.

సంక్షేమ వసతి గృహాల్లో సమస్యల తిష్ట

రాయదుర్గంటౌన్/గుమ్మఘట్ట: పట్టణంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ బాలుర వసతి గృహాల్లో విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రధానంగా అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఎస్సీ బాలికల హాస్టల్, బీసీ బాలుర, కళాశాల బాలుర హాస్టళ్లలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. విద్యార్థులు నేటి వరకు దుప్పట్లు, ట్రంకు పెట్టెలు సరఫరా చేయలేదు. దీంతో అరకొరగా ఇంటి నుంచి తెచ్చుకున్న దుప్పట్లతోనే చలికి వణుకుతూ నిద్రపోతున్నారు. ఈ ఏడాది చేరిన విద్యార్థులు దుప్పట్లు లేకుండా నిద్రపోవాల్సి వస్తోంది. బళ్లారి రోడ్డులోని బీసీ బాలుర వసతి గృహాలో సమస్యలు వెంటాడుతున్నాయి. వర్షం వస్తే రేకుల షెడ్డుతో కూడిన హాల్ కారుతోందని విద్యార్థులు వాపోతున్నారు. స్నానం చేసేందుకు ప్రత్యేకంగా గదులు లేక ఆరుబయట లేదా వాష్ రూములలోనే స్నానం చేయాల్సిన పరిస్థితి. కళాశాల బాలుర హాస్టల్ కూడా అద్దె భవనంలో ఉండడంతో సరైన సౌకర్యాలు అందలేదు. వీరికి కొళాయి నీరు తప్ప మినరల్ వాటర్ సరఫరా లేదు. మరోవైపు గుమ్మఘట్టలోని సంక్షేమ వసతి గృహం వార్డెన్‌కు పట్టణంలోని కళాశాల బాలుర హాస్టల్, బీసీ బాలుర హాస్టల్ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడంతో పర్యవేక్షణ కొరవడింది. 161 మంది విద్యార్థులు ఉన్న హాస్టల్‌లో సరిపడా బాత్‌రూంలు, మరుగుదొడ్లు లేక, కాస్మోటిక్ చార్జీలు చెల్లించక, దోమ తెరలు పంపిణీ చేయక అవస్థలు పడుతున్నారు.

ముద్దన్నం..నీళ్లచారు

ఉరవకొండ: స్థానిక శివరామిరెడ్డి కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో విద్యార్థినులకు నాణ్యత లేని భోజనం అందిస్తున్నారు. మెనూ ప్రకారం అందిస్తున్న భోజనంలో అన్నం పూర్తిగా ముద్దగా మారడం, నీళ్ల చారు వడ్డిస్తున్నారు. 575 మంది విద్యార్థినులు ఉన్న ఈ గురుకుల పాఠశాలలో నాణ్యతగా భోజనం అందించడంలేదు. మురుగునీరు వెళ్లడానికి డ్రెయినేజీ లేదు. పాఠశాల ఆవరణలోనే మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. విద్యార్థినుల అన్నం తినే డైనింగ్ హాల్ పైకప్పు పెచ్చులూడి ఎప్పుడు కూలుతుందో అన్న భయంతో ఉన్నారు.

చలికి వణికిపోతున్న బీసీ హాస్టల్ విద్యార్థులు

ఉరవకొండ పాతపేట వద్ద ఉన్న బీసీ సంక్షేమ బాలుర కళాశాల వసతి గృహంలో కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇక్కడ మొత్తం 60 మంది విద్యార్థులు ఉండగా కనీసం విద్యార్థులకు కప్పుకోవడానికి రగ్గులు కుడా ప్రభుత్వం ఇవ్వకపోవడంతో రాత్రి వేళల్లో చలికి వణికిపోతున్నారు. మరుగుదొడ్లకు ఒక్క తలుపు లేకపోవడంతో విద్యార్థులు ఓపెన్ బాత్‌రూంలోనే స్నానాలు, కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన పరిస్థితి. హాస్టల్ వార్డెన్ కు అదనంగా మరో రెండు హాస్టళ్ల ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇచ్చారు. దీంతో ఆయన వారానికోసారి కూడా విధులకు రావడం లేదని విద్యార్థులు వాపోతున్నారు.



బ్రహ్మసముద్రం ఎస్సీ వసతి గృహంలో ఇరుకు గదిలో నేలపైనే భోజనం చేస్తున్న విద్యార్థులు



కళ్యాణదుర్గం బీసీ బాలుర వసతి గృహంలో ముద్దగా ఉన్న అన్నం



కళ్యాణదుర్గం బీసీ బాలుర వసతి గృహంలో నేలపైనే భోజనం చేస్తున్న విద్యార్థులు



ఉరవకొండ బాలుర వసతి గృహంలో మరుగుదొడ్లకు తలుపులు లేని దృశ్యం

కూటమిది నిరంకుశ పాలన



మాట్లాడుతున్న ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి

బెళుగుప్ప: రాష్ట్రంలో కూటమి నిరంకుశ పాలన సాగిస్తోందని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ వ్యవసాయ తోటలో పార్టీ మండల కన్వీనర్ మచ్చన్న అధ్యక్షతన 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి పాలనపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని,ఎన్నికల హామీలను అమలు చేయాలనే డిమాండ్‌లతో గ్రామ గ్రామానా బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంతో వైఎస్సార్‌సీపీ నాయకత్వం ఇంటింటా వెళ్లి వివరిద్దామని విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. అనంతరం అనుబంధ సంఘాల ప్రతినిధులకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు శివలింగప్ప, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరన్న, సర్పంచులు రుద్రానంద, రామిరెడ్డి, ఎంపీటీసీలు ప్రసాద్, వీరబొమ్మన్న, సీనియర్ నాయకులు శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి, బాబునాయక్, దేవనాథ్‌రెడ్డి, ఎర్రిస్వామి, వెంకటేశులు, మస్తాన్, మాజీ సహకార సంఘ అధ్యక్షులు శ్రీనివాసులు, యువజన విభాగం అధ్యక్షులు భరత్, ఎస్టీసెల్ కన్వీనర్ శ్రీనివాస నాయక్, వికలాంగ విభాగం అధ్యక్షులు రాజేష్, ఎస్సీసెల్ నరేంద్ర, నాయకులు గోవిందరెడ్డి, అశోక్ యాదవ్, గోపాల్, పాతన్న, పురుషోత్తంరాజు, రాధాకృష్ణారెడ్డి, సంతోష్, గోవింద రెడ్డి, కరుణాకర్, వేణుగోపాల్, ఉప్పర శ్రీనివాసులు, అంగడి ఎర్రిస్వామి, నరిగన్న, బాబురెడ్డి, సుంకా నాయక్, రాము రాయల్, లక్ష్మానాయక్, గోపాల్ నాయక్, దాసు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుది కక్ష పూరిత పాలన

కూడేరు: చంద్రబాబు ఎన్నికల హామీలను అమలు చేయకుండా,ప్రతిపక్షనేతలపై అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపుతూ కక్షపూరిత పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఉరవకొండ సమన్వయకర్త వై.విశ్వేశ్వర రెడ్డి ధ్వజమెత్తారు. పార్టీ అనుబంధ సంఘాల నేతలు, ప్రజా ప్రతినిధులు కలిసికట్టుగా పని చేస్తూ చంద్రబాబు చేస్తున్న మోసాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని ఆయన తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని శివరావు ఫంక్షన్ హాల్‌లో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ అమలు కాని హామీలు ఇవ్వడం.. మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టడం చంద్రబాబు నైజమన్నారు. ఏడాది పాలనలో సూపర్ సిక్స్‌లో ఒక్క పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయ లేదన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ పోస్టర్లను పార్టీ నేతలతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణ రెడ్డి, పార్టీ జిల్లా నేత సీపీ వీరన్న, పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, నియోజకవర్గ, మండల నాయకులు వడ్డే గంగాధర్, రామ్మోహన్, రామచంద్ర, చంద్రశేఖర్ యాదవ్, ఓబుళమ్మ, కేశన్న, జయమ్మ, సర్దార్, రంగారెడ్డి, సిద్దారెడ్డి, తిమ్మారెడ్డి, శ్రీనివాసులు, రమేష్, ఓబులేసుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



కూడేరు: బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త వై.విశ్వేశ్వర రెడ్డి

ఏడాదిలోనే కూటమిపై తీవ్ర వ్యతిరేకత



సోమలాపురంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

- వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయిసమావేశంలో సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

డి.హీరేహాళ్(బొమ్మనహాళ్): ఎన్నికల ముందు హామీలు ఇచ్చి ఇప్పుడు ప్రజలకు చంద్రబాబు చేస్తున్న మోసాలను, రెడ్‌బుక్ రాజ్యాంగ అరాచకాలను ప్రజలకు తెలియజేసి వారిని చైతన్యపరచాలని సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం డి.హీరేహాళ్ మండలంలోని సోమలాపురంలో వైఎస్సార్‌సీపీ నాయకుల విస్తృత సమావేశాన్ని మండల కన్వీనర్ రవీంద్రరెడ్డి, సర్పంచ్ సుదర్శన్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళ్ళురించారు. అనంతరం మెట్టు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన పథకాలు, చెప్పని పథకాలు మొదటి ఏడాదిలోనే అమలు చేసి ప్రజలకు సంక్షేమం అంటే ఏంటో చేసి చూపించారన్నారు. చంద్రబాబు ఏడాది పాలనలో సూపర్‌సిక్స్ పథకాలు, హామీలు అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచారని తెలిపారు. సూపర్‌సిక్స్, బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ అంటూ ప్రజలను నమ్మించి ఓట్లు దండుకొని పథకాలు ఎగ్గొట్టి పేదల జీవితాలను గ్యారెంటీ లేకుండా చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వ అరాచకాలను అడ్డుకొని ప్రభుత్వ పనితీరును ఎండగట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ హసీనాబాను, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ బోదరాజు నాయక్, మైనార్టీ నాయకుడు రహంతుల్లా, జిల్లా విభాగం యూత్ అధ్యక్షులు మంజు, నాయకులు సోమలాపురం హనుమంతరెడ్డి, అంజిరెడ్డి, ప్రభాకర్, బాలాజీరెడ్డి, కురుబ హనుమంతరెడ్డి, సందీప్‌రెడ్డి, జగదీష్, పద్మనాభరెడ్డి, చిత్రయ్య, శివరామిరెడ్డి, గంగిరెడ్డి, మంజు, ఈశ్వరగౌడ్, తొండా వెంకటేశ్, కాల్వ తిప్పేస్వామి, అప్పనగౌడ్, జయరామ్, ఎర్రిస్వామి, సర్పంచులు లక్ష్మీ, ఆంజనేయ, పరమేశ్వరప్ప, ఆంజనేయ, మల్లికార్జున, ఎంపీటీసీలు సూజి మహేష్, ఆనంద్ పాల్గొన్నారు.

బాబును నమ్మి మోస పోయాం



చంద్రబాబు పాలనపై విమర్శలు చేస్తున్న మహిళలు

కణేకల్లు: చంద్రబాబును నమ్మి ఓట్లేసి మోసపోయామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి అధికారంలోకొచ్చిన తర్వాత 'సూపర్ సిక్స్' పథకాలేవీ ఇవ్వడం లేదన్నారు. శనివారం మండలంలోని సొల్లాపురం గ్రామంలో 'బాబు ష్యూరిటీ... మోసం గ్యారంటీ' కార్యక్రమం ప్రారంభమైంది. గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానంద రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉషారాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి పాటిల్ నాగిరెడ్డి, ఉపాధ్యక్షులు మారెంపల్లి మారెన్నలు, స్థానిక నాయకులు భాస్కర్‌రెడ్డి 'బాబు ష్యూరిటీ... మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా వెళ్లి చంద్రబాబు చెప్పినవన్నీ ఇస్తున్నాడా? అంటూ నాయకులు మహిళలను ఆరా తీశారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు జగన్నాథరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శివ రామిరెడ్డి, సోమలింగారెడ్డి, కురుబ మహేష్, చెన్నకేశవ, బోయ చెన్నరాయుడు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు వేమన, హళ్లి నాగరాజు, పుల్లంపల్లి పెద్దిరెడ్డి, కెంగుట రామిరెడ్డి, బోయ రవీ, మద్రేగౌడ్, కురుబ సుధాకర్, బోయ నాగరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు విస్మరించడంలో బాబు దిట్ట

గుమ్మఘట్ట: ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించడంలో చంద్రబాబు దిట్ట అని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి విమర్శించారు. రాయదుర్గం మండలం వడ్రహొన్నూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. చంద్రబాబు పచ్చి అబద్ధాల కోరన్నారు. అన్ని వర్గాల ప్రజలను వంచించారని ఆరోపించారు. ఏడాది కాలంలో సుపరిపాలన ఎక్కడుందో అంతుచిక్కడం లేదన్నారు. సుపరిపాలన అంటే మహిళలపై అకృత్యాలు, మానభంగాలు చేయడంలో ఆరితేరిపోయారన్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై కేసులు పెట్టడం, భయభ్రాంతులకు గురిచేయడంలో పట్టుసాధించారన్నారు. ఎన్నికల్లో సాధ్యం కాని హామీలు ఇచ్చి, అమలు చేయలేక ఆ నెపాన్ని వైఎస్సార్‌సీపీపై నెట్టడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం బీసీ,ఎస్సీ కాలనీల్లో ఆయన పర్యటించారు. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వివరించారు. సూపర్‌సిక్స్ హామీలు తమకు అందలేదని పలువురు మహిళలు తెలిపారు. చంద్రబాబును నమ్మి మరోసారి మోసపోయామని వాపోయారు. గ్రామంలో తాగునీటి సమస్య ఉన్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని మహిళలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గౌని ఉపేంద్రరెడ్డి, మండల కన్వీనర్ రామాంజనేయులు, వైస్ ఎంపీపీ అరుణ్ కుమార్, మురళీమోహన్‌రెడ్డి, కోఆప్షన్‌మెంబర్ దిలావర్‌బాష, నాయకులు బొజ్జప్ప, బాబులు, రామన్న యాదవ్, బొజ్జన్న, ముక్కన్న, రామకృష్ణారెడ్డి, శివప్ప, శ్యాంసుందర్‌రెడ్డి, ఆంజనేయులు, జనార్దన, హనుమంతరెడ్డి, నారాయణనాయక్, బానేపల్లి తిప్పేస్వామి, జయన్న, వెంకటేశ్‌నాయక్, హనుమప్ప, రుద్రముని తదితరులు పాల్గొన్నారు.



రాయదుర్గం మండలం వడ్రహొన్నూరులో ప్రభుత్వ మోసాన్ని వివరిస్తున్న మెట్టు, నాయకులు

క్యాటరింగ్ నిర్వాహకుల నిరసన

ఉరవకొండ: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అన్నపూర్ణ ఫుడ్ క్యాటరింగ్ నిర్వాహకురాలు దివ్య, 20 మంది కార్మికులు శనివారం నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న రోడ్డు పక్కనే అన్నపూర్ణ ఫుడ్ క్యాటరింగ్ నిర్వహిస్తూ, జీవనోపాధి పొందుతున్నామన్నారు. అయితే అన్నా క్యాంటీన్ కోసం తమ హోటల్ తొలగించి, జీవనోపాధిపై దెబ్బకొట్టారన్నారు. తమ స్థలాన్ని తమకు ఇప్పించి, న్యాయం చేయాలని కోరారు.

ఘనంగా కార్గిల్ విజయ దినోత్సవం



ఉరవకొండలో క్యాండిల్ ర్యాలీ చేస్తున్న దృశ్యం

ఉరవకొండ: ఉరవకొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అమరవీరులకు నివాళులర్పిస్తూ శనివారం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సప్తగిరి మల్లికార్జున, గణేష్‌బాబు, వేదమూర్తి, పీజీఎస్ నూర్‌మహ్మద్ సత్తెన్న, యేళ్ల ప్రభాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికులకు సన్మానం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని పార్వతినగర్‌లో కార్గిల్ విజయ దివస్‌ను పురస్కరించుకొని సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ తిమ్మప్ప ఆధ్వర్యంలో మాజీ సైనికులను శనివారం సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సైనిక్ బోర్డ్ గిరిష్, అనిల్ కుమార్, ఫకృద్దీన్, మాజీ సైనికుల అసోసియేషన్ అధ్యక్షుడు అమర్నాథ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు దత్తయ్య, మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం



కుందుర్పిలో పూజలందుకుంటున్న లక్ష్మీ నృసింహస్వామి



ప్రత్యేక అలంకరణలో నేమకల్లు అంజనేయస్వామి

రాయదుర్గంటౌన్: మల్లాపురంలో వెలసిన విప్రమలై లక్ష్మీనరసింహస్వామి పల్లకీ ఉత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసం తొలి శనివారాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు రామ్మూర్తి స్వామిజీ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం పూలతో అలంకరించిన పల్లకీలో స్వామి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చి, ఊరేగించారు.

నేమకల్లుకు పోటెత్తిన భక్తులు

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయ స్వామికి భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం మొదటి శనివారం సందర్భంగా వేలాది మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. భక్తులకు ఎస్ఎల్‌వీ స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరి ప్రై.లి నేమకల్లు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

కుందుర్పి: అన్నలపురి ఆంజనేయస్వామి, కుందుర్పి లక్ష్మీనృసింహస్వామి, వడ్డేపాళ్యం గుడిబండ ఆంజనేయస్వామి, తూముకుంట హరిహరేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం కుంకుమార్చన, కుంభాభిషేకాలు, తమలపాకుల అర్చనలు చేశారు.

చిరుత సంచారంపై గస్తీ

రాయదుర్గంటౌన్: చిరుత సంచారంపై ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరంలేదని, చిరుత సంచరించిన ప్రాంతాల్లో గస్తీ ఏర్పాటు చేసి, భద్రతా చర్యలు చేపడతామని ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ దామోదర్‌రెడ్డి తెలిపారు. చిరుత సంచరించిన ప్రాంతాన్ని శనివారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఆంజనేయులు పర్యటించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

బ్రహ్మసముద్రం : సంతే కొండాపురం పంచాయతీ సూగేపల్లిలో తాగునీటి పథకం బోర్లకు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అందులోని రాగి తీగలను ఎత్తుకెళ్లారు. దీంతో రెండు రోజుల నుంచి గ్రామంలో తాగు నీటి సమస్య తలెత్తిందని, ఉన్నతాధికారులు ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మహిళల భద్రత కోసమే శక్తియాప్

రాయదుర్గంటౌన్: మహిళల భద్రత కోసమే శక్తియాప్ రూపొందించబడిందని, ఆపద సమయాలు, అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం కోసం యాప్‌ను వినియోగించాలని యూపీఎస్ ఎస్ఐ రాంప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శక్తియాప్ వినియోగంపై రాయదుర్గం సర్కిల్ శక్తి టీమ్ ఆధ్వర్యంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వీరేష్ అధ్యక్షతన విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శక్తిటీమ్ ఏఎస్ఐ విజయ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ నజీర్ ఖాన్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

ఉరవకొండ రూరల్: బూదగవి సమీపంలో అనంతపురం-బళ్లారి రహదారిపై శనివారం సాయంత్రం 11 కేవీ విద్యుత్ స్తంభం నేలకూలింది. ఆ సమయంతో అక్కడ వాహనాల రాకపోకలు లేకపోవటంతో పెను ప్రమాదం తప్పింది. స్తంభాన్ని తొలగించటంతో రాకపోకలు సజావుగా సాగాయి.

పండ్లమొక్కలకు పేర్లు నమోదు చేసుకోండి

కుందుర్పి: మండలంలోని ఉద్యాన రైతులు పండ్ల మొక్కలకు పేర్లు నమోదు చేసుకోవాలని కుసుమగిరి రైతు సంఘం సీఈఓ నరసింహమూర్తి, డైరెక్టర్ లక్ష్మీపతి తెలిపారు. శనివారం శెట్టూరు మండలం లక్ష్మంపల్లి పంచాయతీ, అప్పిలేపల్లి, కుందుర్పి పంచాయతీల్లోని రైతులకు పొలాల్లో సర్వేలు చేసి, ఉచితంగా పండ్ల మొక్కలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్లు ఆంజనేయులు, లోకేశప్ప, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

కౌలు కార్డులు మంజూరు చేయాలి

ఉరవకొండ: పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయ భూములు సాగు చేస్తున్న కౌలు రైతులకు సీసీఆర్‌సీ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి, కార్యదర్శి పెద్దముష్టూరు వెంకటేష్ డిమాండ్ చేశారు. శనివారం కోనాపురంలో కౌలు రైతుల సమావేశం నిర్వహించారు. అనంతరం కౌలు రైతు సంఘం కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా బ్రహ్మయ్య, కార్య దర్శి సురేష్, సహాయకార్యదర్శిగా ఉమాపతి, కోశాధికారిగా నారాయణ, హనుమంతు ఎంపికయ్యారు.

రేపు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ రాధిక కాంప్లెక్స్ వద్ద సాయంత్రం 3 గంటలకు విస్తృత స్థాయి సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ వన్నల్లి రామాంజనేయులు తెలిపారు. రాయదుర్గం సమన్వయకర్త , మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి హాజరవుతారన్నారు. అనుబంధ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచులు, జెడ్పీటీసీ, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి

కళ్యాణదుర్గం రూరల్: కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్ కోరారు. శనివారం పట్టణంలోని టీసర్కిల్‌లో సీపీఐ మహాసభలను పురస్కరించుకొని జెండా ఆవిష్కరించారు. మల్లికార్జున మాట్లాడుతూ పట్టణంలోని కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత మున్సిపాలిటీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. అనంతరం సీపీఐ కళ్యాణదుర్గం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గడ్డివామి స్థలం కోసం ఘర్షణ

బెళుగుప్ప: యలగలవంక తండాలో గడ్డివామి స్థలం కోసం శ్రీరాములు నాయక్, చంద్రానాయక్ మధ్య శనివారం ఘర్షణ జరిగింది. ఘర్షణలో శ్రీరాములు నాయక్ చూపుడు వేలును చంద్రానాయక్ పూర్తిగా కొరికి పడేశాడు. బాధితుడు, అతని భార్య సావిత్రిబాయి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై ఎస్ఐ శివ దర్యాప్తు చేస్తున్నారు.

అండేపల్లిలో 25 గొర్రెల అపహరణ

కళ్యాణదుర్గం రూరల్: కంబదూరు మండలంలోని అండేపల్లి వద్ద గొర్రెల మంద నుంచి 25 గొర్రెలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఘటనపై బాధితుడు మల్లేష్ స్థానిక పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు.